# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 03-01-2026** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **భూ వివాదాలు, రికార్డుల్లో తప్పులు లేకుండా పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.**

2. **మూసీ నది ప్రక్షాళన పనులు వచ్చే మార్చి నాటికి ప్రారంభిస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి వెల్లడించారు.**

3. **తెలంగాణలోని ప్రసిద్ధ పుణ్య క్షేత్రమైన జగిత్యాల జిల్లా కొండగట్టులో ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ ఈరోజు పర్యటించనున్నారు.**

4. **దేశంలో భూసంస్కరణలకు కేంద్రం ప్రభుత్వం చర్యలు చేపట్టిందని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు.**

5. **రాజధాని అమరావతి విస్తరణకు రెండవ విడత భూ సమీకరణలో 16 వేల 667 ఎకరాలను ప్రభుత్వం రైతుల నుంచి సమీకరించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ పేర్కొన్నారు.**

==========================

భూ వివాదాలు, రికార్డుల్లో తప్పులు లేకుండా పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. విదేశీ పర్యటనలో ఉన్న ఆయన రాష్ట్ర మంత్రులతో శ్రవణ మాధ్యమ సమావేశాన్ని నిన్న నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు నూతన సంవత్సర కానుకగా రాజముద్రతో కూడిన 22 లక్షల పట్టాదారు పాస్ పుస్తకాలను రైతులకు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. రైతులకు భూ సమస్యలు లేకుండా చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

-------------------------

మూసీ నది ప్రక్షాళన పనులు వచ్చే మార్చి నాటికి ప్రారంభిస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి వెల్లడించారు. హిమాయత్ సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకూ 21 కిలో మీటర్ల మేర మొదట అభివృద్ధి చేస్తామని అన్నారు. శాసన సభలో మూసీ నది పునరుద్ధరణపై చర్చకు ఆయన నిన్న సమాధానమిస్తూ.. ఈ ప్రాజెక్టుకు ఆసియా అభివృద్ధి బ్యాంక్ 4 వేల కోట్ల రూపాయలు రుణం ఇచ్చేందుకు ముందుకు వచ్చిందని

తెలిపారు. వివరణాత్మక ప్రాజెక్టు నివేదిక పూర్తయిన అనంతరం ఈ ప్రాజెక్టు వివరాలను ఎమ్మెల్యేలందరికీ తెలియజేస్తామని పేర్కొంటూ..

వాయిస్..32 సెకన్లు

---

తెలంగాణలోని ప్రసిద్ధ పుణ్య క్షేత్రమైన జగిత్యాల జిల్లా కొండగట్టులో ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ ఈ రోజు పర్యటించనున్నారు. కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానంలో తిరుమల తిరుపతి దేవస్థానం మంజూరు చేసిన 35.19 కోట్ల రూపాయల నిధులతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేయనున్నారు. ఈ నిధులతో దీక్షా మండపం, 96 గదుల సత్రాన్ని నిర్మించనున్నట్లు అధికారులు వెల్లడించారు.

---

దేశంలో భూసంస్కరణలకు కేంద్రం ప్రభుత్వం చర్యలు చేపట్టిందని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ లోని గుంటూరు జిల్లా కేంద్రంలో రైతులకు పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని నిన్న నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. భూముల రీ సర్వేను దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమం అమల్లో రాష్ట్రం మొదటి స్థానంలో ఉందని వెల్లడించారు. దీంతో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ప్రోత్సాహకంగా 400 కోట్ల రూపాయలను మంజూరు చేసినట్లు పేర్కొన్నారు.

---

ఆంగ్లమాధ్యమ ప్రభావం నుంచి తెలుగు భాషను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.ఎస్. నరసింహ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్టీఆర్ జిల్లా విజయవాడలో 36వ పుస్తక మహోత్సవాన్ని ఆయన నిన్న ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శాసన సభ ఉప సభాపతి కె.రఘురామకృష్ణ రాజుతో కలిసి పాల్గొన్న ఆయన.. పిల్లలతో పుస్తకాలు చదివించాలని సూచించారు. పుస్తకాలు ప్రాణం పోసుకున్న జీవులని పేర్కొంటూ..

వాయిస్..27 సెకన్లు

---

రాజధాని అమరావతి విస్తరణకు రెండవ విడత భూ సమీకరణలో 16 వేల 667 ఎకరాలను ప్రభుత్వం రైతుల నుంచి సమీకరించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ వెల్లడించారు. ఈ నెల 7వ తేదీ నుంచి భూ సమీకరణ ప్రక్రియ మొదలవుతుందని తెలిపారు. మౌలిక సదుపాయాల కల్పనకు రాజధాని గ్రామాలైన నేలపాడు, మల్కాపురంలలో గ్రామసభలను నిన్న నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ..

వాయిస్..32 సెకన్లు

---

దేశ వ్యాప్తంగా ప్రతిపాదిత పెట్టుబడుల్లో రాష్ట్రం అగ్రగామిగా ఉందని ఆంధ్రప్రదేశ్ ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ వెల్లడించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో తొలి 9 నెలల్లో ప్రతిపాదిత మొత్తం పెట్టుబడుల్లో 25.3

శాతం వాటాను రాష్ట్రం దక్కించుకుందని బ్యాంక్ ఆఫ్ బరోడా తాజా నివేదిక వెల్లడించిందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిరంతరం సంస్కరణలు, వేగవంతమైన నిర్ణయాలు, పెట్టుబడిదారుల పట్ల స్పష్టమైన నిబద్ధతకు ఇది ఫలితమని తెలిపారు. ఈ నివేదిక ప్రకారం దేశవ్యాప్తంగా మొత్తం మూలధన పెట్టుబడుల్లో 51.2 శాతం ఆంధ్రప్రదేశ్, ఒడిషా, మహారాష్ట్ర లలోనే కేంద్రీకృతమై ఉందని పేర్కొన్నారు.

---------------------------

కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన వీబీ–జీ రామ్ జీ పథకం గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి తోడ్పాటు అందిస్తుందని ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా బైరి సింగుపురం గ్రామ వాసులు అంటున్నారు. ఈ పథకంలో ప్రతి కుటుంబానికి పని దినాలను 100 రోజుల నుంచి 125 రోజుల పెంచడం తమకు ఆర్థికంగా ప్రయోజనం చేకూరుతుందని పేర్కొంటున్నారు. వీబీ–జీ రామ్ జీ పథకం గురించి ఉపాధి పథకం వేతనదారుడు టి.రాంబాబు ఆకాశవాణితో మాట్లాడుతూ..

వాయిస్.. 25 సెకన్లు

---------------------------

ఉత్తర కోస్తా ఆంధ్రప్రదేశ్, యానాంలలో దిగువ ట్రోపో ఆవరణంలో వాయువ్య దిశగా, దక్షిణ కోస్తా ఆంధ్ర ప్రదేశ్, రాయలసీమలలో ఈశాన్య, తూర్పు దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణం కేంద్రం పేర్కొంది. వీటి ఫలితంగా రాష్ట్రంలోని ఉత్తర కోస్తా, యానాం, దక్షిణ కోస్తా, రాయలసీమలలో ఈ రోజు దట్టమైన పొగమంచు ఒకటి, రెండు చోట్ల కురిసే అవకాశము వుందని వాతావరణ కేంద్రం అధికారి ఎల్. నారాయణ తెలిపారు.

తెలంగాణలో రానున్న రెండు రోజుల పాటు పొడి వాతావరణం ఏర్పడే అవకాశము ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడిచింది.

---------------------------

ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. సాధ్యమైనంత త్వరగా ఉద్యోగుల బకాయిలను చెల్లించనున్నట్లు తెలిపారు. శాసన మండలిలో నిన్న సభ్యులు అడిగిన ప్రశ్నకు ఉపముఖ్యమంత్రి సమాధానమిస్తూ.. ఉద్యోగులు, పెన్షనర్ల ఆరోగ్యం, సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రతినెల ఉద్యోగుల బకాయిల కోసం 700 కోట్ల రూపాయలకు పైగా నిధులు విడుదల చేస్తున్నామని వివరించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ ను ఏర్పాటు చేశామని వెల్లడించారు.

---------------------------

దేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు, ప్రముఖ సంఘ సంస్కర్త, రచయిత్రి, నిమ్న వర్గాల అభ్యున్నతి కోసం అహర్నిశలు శ్రమించిన జ్యోతిరావు పూలే సతీమణి సావిత్రి బాయి పూలే జయంతి ఈరోజు. 1831 జనవరి 3వ తేదీన మహారాష్ట్ర లోని సతారా జిల్లా నయ గావ్ గ్రామంలో రైతు కుటుంబంలో జన్మించిన ఆమె.... పీడిత ప్రజలు... ముఖ్యంగా మహిళల విద్యాభివృద్ధికి ఎనలేని కృషి చేశారు. సామాజిక మార్పునకు, చైతన్యం పొందడానికి, లింగ సమానత్వం సాధించడానికి విద్యే ఆయుధమని బలంగా విశ్వసించిన పూలేదంపతులు .... ఆ దిశగా తమ యావ జ్జీవితాన్ని అంకితం చేశారు. 1897 మార్చి 10వ తేదీన సావిత్రిబాయి పూలే తుదిశ్వాస విడిచారు.

=====================